


EVENING EDITION

నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com

4PM
www.suryaa.com
సోమవారం
12-05-2025
పేజీలు: 02





# టెస్ట్ క్రికెట్‌కు కోహ్లి గుడ్ బై



టీమిండియా స్టార్ క్రికెటర్ విరాట్ కోహ్లి టెస్టులకు గుడ్ బై ప్రకటించాడు. లాంగ్ ఫార్మాట్ నుంచి రిటైర్ అవుతున్నట్లు సోమవారం సోషల్ మీడియా ద్వారా ప్రకటించాడు. ఆస్ట్రేలియాతో జరిగిన బోర్డర్ గావస్కర్ సిరీస్‌లో విఫలమైన కోహ్లి.. ఇంగ్లాండ్‌తో సిరీస్‌కు నెల రోజుల ముందు రిటైర్మెంట్ ప్రకటించడం గమనార్హం. ఇటీవలే రోహిత్ శర్మ సైతం టెస్టులకు రిటైర్మెంట్ ప్రకటించిన సంగతి తెలిసిందే. వెంటనే కోహ్లి కూడా టెస్టులకు రిటైరవుతాడనే వార్తలొచ్చాయి. ఇంతకు ముందే రోహిత్, కోహ్లి ద్వయం టీ20లకు రిటైర్మెంట్ ప్రకటించింది. ఇక నుంచి వీరిద్దరూ వన్డేలకు మాత్రమే పరిమితం కానున్నారు.“టెస్ట్ క్రికెట్‌లో నేను మొదటిసారి భారత జట్టు క్యాప్ ధరించి 14 సంవత్సరాలు అయింది. నేను ఈ ఫార్మాట్ నుంచి తప్పుకుంటున్నా. ఇది అంత ఈజీ కాదు. కానీ ప్రస్తుత పరిస్థితుల్లో ఇదే సరైనది అని నాకు అనిపిస్తోంది. ఈ ఫార్మాట్ కోసం నేను ఏం చేయగలనో.. నా వల్ల ఎంత అవుతుందో అంతా చేశాను. ఇదే సమయంలో నేను ఊహించనిదానికంటే ఎక్కువే నాకు ఈ ఫార్మాట్ ఇచ్చింది. నా టెస్టు కెరీర్‌ను ఎప్పుడు తిరిగి చూసుకున్నా అది సంతోషాన్ని ఇస్తుంది” అని విరాట్ కోహ్లీ పోస్టు పెట్టాడు. తన కెరీర్‌లో 123 టెస్టు మ్యాచులు ఆడిన కోహ్లీ.. 9230 రన్స్ స్కోరు చేశాడు. ఇందులో 7 డబుల్ సెంచరీలు, 30 సెంచరీలు, 31 హాఫ్ సెంచరీలు ఉన్నాయి.ఇటీవల రోహిత్ శర్మ టెస్టు క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు. అప్పటి నుంచి కోహ్లీ సైతం గుడ్‌బై చెప్పేస్తాడని ప్రచారం జరిగింది. దీనిపై చాలా మంది మాజీ క్రికెటర్లు కోహ్లీ నిర్ణయం మార్చుకోవాలని సూచించారు. టెస్టు క్రికెట్‌కు అతడి అవసరం ఉందని.. దయచేసి నిర్ణయం మార్చుకోవాలని సూచించారు. వెస్టిండీస్ క్రికెట్ దిగ్గజం బ్రియాన్ లారా సైతం ఇదే రిక్వెస్ట్ చేశాడు. అంబటి రాయుడు, నవ్‌జ్యోత్ సింగ్ సిద్ధూ, మైకెల్ వాన్ ఇలా ఎంతో మంది ప్రముఖులు కోహ్లీ మరింత కాలం టెస్టు క్రికెట్‌లో కొనసాగాలని అభిప్రాయం వ్యక్తం చేశారు.ఓ దశలో బీసీసీఐ కూడా కోహ్లీని ఒప్పించాలని ప్రయత్నించినట్లు వార్తలు వచ్చాయి. రోహిత్, కోహ్లి ఇద్దరూ ఒకేసారి రిటైర్మెంట్ ప్రకటిస్తే.. దాని ప్రభావం జట్టుపై ఉంటుందని.. అందుకే మరి కొంత కాలం లాంగ్ ఫార్మాట్లో ఆడాలని బీసీసీఐ విరాట్‌కు సూచించినట్లు సమాచారం.

## ఈటలపై జగ్గారెడ్డి ఫైర్ బట్టలిప్పి
# గుంజీలు తీయిస్తా అంటూ వార్నింగ్



సీఎం రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీని ఉద్దేశించి బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ చేసిన వ్యాఖ్యలపై టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. మరోసారి ఇటువంటి 'లూజ్ కామెంట్స్' చేస్తే సహించేది లేదని, తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని గట్టి హెచ్చరిక జారీ చేశారు. ఈ ఈటల పాగల్ గాడు అయ్యిండు అన్నీ బేవకూఫ్ చేష్టలు చేస్తున్నాడు అంటూ మండిపడ్డారు. ఆదివారం నాడు గాంధీ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జగ్గారెడ్డి ఈ వ్యాఖ్యలు చేశారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని లక్ష్యంగా చేసుకుని ఈటల రాజేందర్ చేసిన వ్యాఖ్యలపై జగ్గారెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా తన నల్లికుట్ల రాజకీయాలు మానుకోవాలి. హద్దులు మీరి నువ్వు మాట్లాడావు, అందుకే నేను కూడా హద్దులు దాటి సమాధానం చెప్పాల్సి వస్తోంది. అసలు, ఈటలను తిట్టడానికే ఈ ప్రెస్ మీట్ పెట్టాను" అని జగ్గారెడ్డి పేర్కొన్నారు. మల్కాజ్‌గిరి నియోజకవర్గ ప్రజల సమస్యల గురించి ఈటల ఏనాడూ మాట్లాడలేదని, కేవలం రాజకీయ విమర్శలకే పరిమితమయ్యారని ఆయన ఆరోపించారు.బీజేపీలో ఆశించిన పదవులు దక్కకపోవడంతో ఈటల రాజేందర్ తీవ్ర నిరాశ, నిస్పృహలతో ఉన్నారని జగ్గారెడ్డి ఎద్దేవా చేశారు. "గంజాయి తాగిన వ్యక్తిలా, ఒక సైకోలా ఈటల ప్రవర్తిస్తున్నాడు. పదవి రాలేదన్న ఫ్రస్టేషన్‌లోనే ఆయన ఇలా మాట్లాడుతున్నారు" అని విమర్శించారు. బూతులు మాట్లాడే వారికి బూతులతోనే సమాధానం చెప్పాల్సి వస్తుందని జగ్గారెడ్డి స్పష్టం చేశారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దయతలచి ఈటల వ్యాఖ్యలను పట్టించుకోకుండా వదిలేస్తున్నారేమో కానీ, తాము మాత్రం అలాంటి వ్యాఖ్యలను ఉపేక్షించేది లేదని జగ్గారెడ్డి హెచ్చరించారు. "మళ్ళీ ఇంకోసారి ముఖ్యమంత్రి గురించి గానీ, కాంగ్రెస్ పార్టీ గురించి గానీ తగని రీతిలో మాట్లాడితే నడిరోడ్డు మీద బట్టలు విప్పి గుంజీలు తీయిస్తాం" అంటూ తీవ్ర పదజాలంతో జగ్గారెడ్డి హెచ్చరికలు జారీ చేశారు. ఈటల తన పరిమితుల్లో ఉండి మాట్లాడటం నేర్చుకోవాలని సూచించారు.

## బెజోస్‌ను అధిగమించి
# రెండో స్థానంలో మార్క్ జుకర్ బర్గ్



ప్రపంచంలోని అత్యంత సంపన్నుల జాబితాలో ఆసక్తికరమైన మార్పులు చోటుచేసుకున్నాయి. ఫేస్‌బుక్ మాతృ సంస్థ మెటా సీఈఓ మార్క్ జుకర్‌బర్గ్, అమెజాన్ వ్యవస్థాపకుడు జెఫ్ బెజోస్‌ను అధిగమించి ప్రపంచంలోనే రెండో అత్యంత సంపన్న వ్యక్తిగా అవతరించారు. బ్లూమ్‌బెర్గ్ బిలియనీర్స్ ఇండెక్స్ ఈ తాజా వివరాలను వెల్లడించింది. టెస్లా అధినేత ఎలాన్ మస్క్ తన అగ్రస్థానాన్ని పదిలంగా కాపాడుకున్నారు.బ్లూమ్‌బెర్గ్ బిలియనీర్స్ ఇండెక్స్ ప్రకారం, మార్క్ జుకర్‌బర్గ్ నికర సంపద 212 బిలియన్ డాలర్లకు చేరగా, జెఫ్ బెజోస్ సంపద 209 బిలియన్ డాలర్లకు పడిపోయింది. మే 5 నాటి ట్రేడింగ్‌లో జుకర్‌బర్గ్ సంపద 846 మిలియన్ డాలర్లు పెరిగితే, అదే సమయంలో బెజోస్ 2.90 బిలియన్ డాలర్లు నష్టపోయారు. గత నెలలో మెటా షేర్ల విలువ 16 శాతానికి పైగా పెరగడం, అదే కాలంలో అమెజాన్ షేర్లు కేవలం 6.33 శాతం మాత్రమే వృద్ధి చెందడం ఈ మార్పుకు ప్రధాన కారణంగా కనిపిస్తోంది. ఈ ఏడాది ఇప్పటివరకు జుకర్‌బర్గ్ సంపద 4.63 బిలియన్ డాలర్లు పెరిగింది.మెటా ప్రకటించిన బలమైన ఆర్థిక ఫలితాలు కూడా జుకర్‌బర్గ్ సంపద వృద్ధికి దోహదపడ్డాయి. మే 1న వెల్లడించిన మొదటి త్రైమాసికంలో మెటా 42.31 బిలియన్ డాలర్ల ఆదాయాన్ని నివేదించింది. ఇది విశ్లేషకుల అంచనా అయిన 41.39 బిలియన్ డాలర్ల కంటే ఎక్కువ. ఇక రెండో త్రైమాసికానికి గాను 42.5 బిలియన్ డాలర్ల నుంచి 45.5 బిలియన్ డాలర్ల మధ్య ఆదాయాన్ని అంచనా వేస్తున్నట్లు కంపెనీ తెలిపింది. మరోవైపు, టెస్లా మరియు స్పేస్‌ఎక్స్ సీఈఓ ఎలాన్ మస్క్ 331 బిలియన్ డాలర్ల నికర సంపదతో ప్రపంచంలోనే అత్యంత ధనవంతుడిగా తన స్థానాన్ని నిలబెట్టుకున్నారు. ఏప్రిల్ 23న మస్క్ నికర విలువ 7.5 బిలియన్ డాలర్లు పెరిగింది. ప్రభుత్వ వ్యవహారాలకు కేటాయించే సమయాన్ని తగ్గించుకుని, టెస్లా కంపెనీ కార్యకలాపాలపై మరింత ఎక్కువ దృష్టి సారిస్తానని ఆయన పునరుద్ఘాటించడంతో టెస్లా షేర్లు 5% మేర పెరిగాయి.

# 10 శాటిలైట్లు 24 బై 7 దేశాన్ని పహారా కాస్తున్నాయి: ఇస్రో

పాకిస్థాన్‌తో తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్న ప్రస్తుత పరిస్థితుల్లో దేశ సరిహద్దులు తీరప్రాంతాన్ని పర్యవేక్షించడానికి, రక్షించడానికి 10 భారతీయ ఉపగ్రహాలు 24 గంటలు నిర్విరామంగా పనిచేస్తున్నాయని ఇస్రో చైర్మన్ వి. నారాయణన్ అన్నారు. కీలకమైన నిఘా డేటాను అందించడం ద్వారా పౌరులను రక్షించడంలో ఈ ఉపగ్రహాలు వ్యూహాత్మక పాత్ర పోషిస్తాయని తెలిపారు. మణిపూర్‌లోని ఇంఫాల్‌లో జరిగిన సెంట్రల్ అగ్రికల్చరల్ యూనివర్సిటీ (CAU) 5వ స్నాతకోత్సవంలో ఇస్రో చైర్మన్ మాట్లాడుతూ.. భారతదేశపు 7,000 కిలో మీటర్ల సముద్ర తీరం, ఉత్తర భూభాగాలపై నిరంతరం నిఘా ఉంచాల్సిన అవసరం గురించి ఆయన వివరించారు.“మన దేశ భద్రతను నిర్ధారించుకోవాలంటే, మన ఉపగ్రహాల ద్వారా సేవలందించాలి. మన సముద్ర తీర ప్రాంతాలను మనం పర్యవేక్షించాలి. మనం మొత్తం ఉత్తర భాగాన్ని నిరంతరం పర్యవేక్షించాలి” అని నారాయణన్ అన్నారు. శాటిలైట్లు, డ్రోన్ టెక్నాలజీ లేకుండా భారతదేశం పూర్తి భద్రతా కవరేజీని సాధించలేమని నారాయణన్ స్పష్టం చేశారు. ప్రస్తుత భౌగోళిక రాజకీయ పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని, ముఖ్యంగా “పొరుగువారు” ముప్పును కలిగిస్తున్నందున, రక్షణ సంసిద్ధతకు అంతరిక్ష ఆధారిత నిఘా చాలా కీలకంగా మారింది. జాతీయ భద్రతపై ఇస్రో తీసుకుంటున్న చర్యలను, పోషిస్తున్న కీలక పాత్రను ఆయన వివరించారు. కాగా.. భారత్, పాకిస్తాన్ మధ్య కొనసాగుతున్న ఉద్రిక్తతల నేపథ్యంలో ఇస్రో ఉపగ్రహ నిఘా మరింత కీలకంగా మారుతోంది. సరిహద్దు ఘర్షణల ముప్పు, రియల్-టైమ్ ఇంటెలిజెన్స్ అవసరం దృష్ట్యా, అంతరిక్ష ఆధారిత పర్యవేక్షణ భారతదేశానికి వ్యూహాత్మక ప్రయోజనాన్ని అందిస్తుంది. ఈ ఉపగ్రహాలు అందించే నిరంతర నిఘా, సరిహద్దుల వెంబడి, సముద్రంలో ఏవైనా శత్రు కార్యకలాపాల పట్ల సాయుధ దళాలు అప్రమత్తంగా ఉండటానికి సహాయపడుతుంది. భౌగోళిక రాజకీయ సవాళ్లు కొనసాగుతున్నందున, ఉపగ్రహం, డ్రోన్ సాంకేతికతలో భారతదేశం పెట్టుబడి పెట్టడం దేశ రక్షణను బలోపేతం చేయడమే కాకుండా, ప్రత్యర్థులకు సంసిద్ధత, సాంకేతిక సామర్థ్యం గురించి స్పష్టమైన సందేశాన్ని కూడా పంపుతుంది.





# అలాంటి పాత్రలు చేయను

కొన్ని సినిమాలు నటీనటుల మనస్తత్వాల్లో కూడా మార్పును తెస్తుంటాయి. ‘కేసరి 2’ సినిమా వల్ల నటి అనన్య పాండేకు అలానే జరిగిందట. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో తనలో వచ్చిన మార్పు గురించి అనన్య మీడియాతో మాట్లాడింది. ‘కెరీర్ తొలినాళ్లలో ఎలాంటి పాత్రలు ఎంచుకోవాలో తెలిసేది కాదు. అందుకే అన్నీ బబ్లీ కేరక్టర్లే చేశాను. అందులో కామెడీ, గ్లామర్ పాత్రలే ఎక్కువ. అయితే.. రీసెంట్‌గా ‘కేసరి 2’లో నటనకు ఆస్కారమున్న మంచి పాత్ర చేశాను. ఆ పాత్రలో నన్నునేను చూసుకున్న తర్వాత నటిగా నాలో చాలా మార్పు వచ్చింది. ముఖ్యంగా ఎలాంటి కథలు ఎంచుకోవాలో తెలిసొచ్చింది. ‘కేసరి 2’లో నేను చేసిన పాత్ర నాకొక సవాల్. నటిగా నా పొటెన్షియాలిటీని తెలియజెప్పిందా పాత్ర. ఇకనుంచి సునాయాసంగా నటించగలిగే పాత్రల్ని చేయను. సవాలు విసిరే పాత్రలే చేస్తా. అవకాశాలు తగ్గినా పర్లేదు.’ అంటూ చెప్పుకొచ్చింది అనన్య పాండే.

## పాక్ కాల్పుల విరమణ ప్రతిపాదన

# భారత్ ఆచితూచి స్పందన



దాయాది దేశాల మధ్య ఉద్రిక్తతలు తీవ్రస్థాయిలో కొనసాగుతున్న వేళ, ఎవరూ ఊహించని రీతిలో కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిందంటే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. సోషల్ మీడియాలో ట్రంప్ చేసిన పోస్టు అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. అప్పటివరకు, ఈ వ్యవహారంలో అమెరికా పెద్దగా జోక్యం చేసుకున్నట్టు కనిపించకపోవడమే ఈ ఆశ్చర్యానికి కారణం. ఈ నేపథ్యంలో, అసలేం జరిగిందన్నది భారత అధికారులు వెల్లడించారు. భారత్ ముమ్మరంగా దాడులు చేస్తున్న వేళ పాకిస్థాన్ నుంచి కాల్పుల విరమణ ప్రతిపాదన అందింది. శుక్రవారం ఉదయం 9 గంటల ప్రాంతంలో భారత డైరెక్టర్ జనరల్ ఆఫ్ మిలిటరీ ఆపరేషన్స్ లెఫ్టినెంట్ జనరల్ రాజీవ్ ఘాయ్‌కు పాకిస్థాన్ డీజీఎంఓ మేజర్ జనరల్ కాషిఫ్ అబ్దుల్లా హాట్‌లైన్‌లో ఫోన్ చేశారు. ఈ సంభాషణలో కాషిఫ్ అబ్దుల్లా కాల్పుల విరమణ అంశాన్ని ప్రస్తావించారు. అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో, పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ జనరల్ అసిమ్ మునీర్‌తో జరిపిన సంభాషణను కూడా ఆయన ప్రస్తావించారు. ఈ పరిణామం, కాల్పుల విరమణ ప్రతిపాదన పాక్ ఆర్మీ ఉన్నతాధికారుల నుండే వచ్చిందన్న దానికి స్పష్టమైన సూచన.అయితే, లెఫ్టినెంట్ జనరల్ ఘాయ్ ఈ విషయాన్ని తన పైఅధికారులకు తెలియజేసినప్పటికీ, పాక్ డీజీఎంఓతో చర్చలు జరపాల్సిందిగా ఆయనకు ఎటువంటి ఆదేశాలు రాలేదు. ఉదయం 10:50 గంటలకు భారత విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ నిర్వహించిన మీడియా సమావేశంలో కూడా పాకిస్థాన్ నుంచి వచ్చిన ఈ ప్రతిపాదన గురించి ఎటువంటి ప్రస్తావన చేయలేదు. ఆ సమావేశంలో, భారత వైమానిక దళం పాకిస్థాన్ వైమానిక స్థావరాలపై చేసిన దాడులు, వాటి వల్ల కలిగిన నష్టాలను మాత్రమే ఆయన వెల్లడించారు.ఆసక్తికరంగా, ఉదయం 11 గంటల ప్రాంతంలో అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్‌కు ఫోన్ చేసిన సమయానికి ఐఏఎఫ్ దాడులను మరింత ఉద్ధృతం చేసింది. పాక్ వాయుసేనకు అత్యంత కీలకమైన నూర్ ఖాన్ ఎయిర్ బేస్ ను ధ్వంసం చేసింది. దాంతో పాక్ హడలిపోయింది. కీలక సైనిక, వైమానికి స్థావరాలను భారత్ లక్ష్యంగా చేసుకుని దాడులు చేస్తుండడంతో తీవ్ర ఆందోళనకు గురైంది. ఈ దశలోనే పాక్ నుంచి కాల్పుల విరమణ ప్రతిపాదన భారత్ కు అందింది.ఇక అమెరికా విదేశాంగ మంత్రితో సంభాషణ అనంతరం జైశంకర్ ఎక్స్ లో చేసిన పోస్టును బట్టి, "భారత్ వైఖరి ఎప్పుడూ ఆచితూచి, బాధ్యతాయుతంగానే ఉంటుంది, ఇప్పుడూ అదే విధంగా ఉంది" అని రూబియోకు స్పష్టం చేసినట్లు తెలుస్తోంది. ఉద్రిక్తతలు తక్షణమే తగ్గించాలని రూబియో పట్టుబట్టినప్పటికీ, అప్పటి పరిస్థితులను బట్టి ఆ ప్రతిపాదనకు జైశంకర్ ప్రాధాన్యత ఇవ్వలేదని అర్థమవుతోంది.అదే సమయంలో ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన ఉన్నతస్థాయి సమావేశంలో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్, చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ అనిల్ చౌహాన్, త్రివిధ దళాధిపతులు జనరల్ ఉపేంద్ర ద్వివేది, అడ్మిరల్ దినేష్ త్రిపాఠి, ఎయిర్ చీఫ్ మార్షల్ ఏపీ సింగ్, ఐబీ, రా చీఫ్‌లు తపన్ దేకా, రవి సిన్హా పాల్గొన్నారు. ఈ సమావేశంలో పాల్గొన్న వారంతా, భారత్ ప్రస్తుతం పైచేయి సాధించిందని, ఈ ఆధిక్యతను మరింత పటిష్టం చేసుకోవాలనే ఏకాభిప్రాయానికి వచ్చారు. పాకిస్థానే స్వయంగా కాల్పుల విరమణకు ముందుకు రావడం కూడా భారత్ ఆధిక్యతను సూచిస్తోందని వారు విశ్లేషించుకున్నట్లు తెలిసింది. బలగాల అధిక మనోస్థైర్యం, తగినంత ఆయుధ సంపత్తి, ఆర్థికంగా మెరుగైన స్థితి, అంతర్జాతీయ సానుభూతి, హిందూ మహాసముద్రంలో భారత నౌకాదళం 'బ్లూ వాటర్' సామర్థ్యం వంటి అంశాలు భారత్‌కు అనుకూలంగా ఉన్నాయని సమావేశంలో అంచనా వేశారు.ఇలాంటి పరిస్థితుల నడుమ, కేవలం కొన్ని గంటల వ్యవధిలోనే భారత్, పాకిస్థాన్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదరడం అనేకమందిని ఆశ్చర్యానికి గురిచేసింది.





# రయ్, రయ్ మంటూ స్కేటింగ్‌లో ఏంజాయ్ చేస్తున్న చిన్నారులు


స్కేటింగ్ లో చిన్నారులు తెగ ఏంజాయ్ చేస్తున్నారు. రయ్, రయ్ మంటూ దూసుకుపోతున్నారు. పిల్లలు స్కేటింగ్ చేస్తుంటే వారి పేరెంట్స్ చూస్తూ ఆనందిస్తున్నారు. హైదరాబాద్ జింఖానా గ్రౌండ్స్ లో స్కేటింగ్ శిక్షణ ఇస్తున్న అనుప్ కుమార్ యామా . అతను 2015లో భారత ప్రభుత్వం నుండి అర్జున అవార్డును గెలుచుకున్నాడు (జాతీయ క్రీడలలో అత్యుత్తమ సాధనకు). జింఖానా మైదానంలో ప్రతి రోజు ఉదయం మరియు సాయంత్రం చిన్నారులకు శిక్షణ అందిస్తున్న కొత్త కొత్త ప్లేయర్స్ కు తయారుచేస్తున్నాడు. . శిక్షణ శిబిరాల్లో నెల రోజుల పాటు విద్యార్థులు శిక్షణ తీసుకొని ఆటల్లో రాణిస్తారు. అలాగే వారి శారీరక, మానసిక దృక్పథంలో మార్పులు రావడంతో పాటు కండరాలు, ఎముకల పెరుగుదల, రక్తప్రసరణ, మెదడు, గుండె చక్కగా పనిచేస్తాయి. ఇలాంటి ఎన్నో ప్రయోజనాలున్న వేసవి క్రీడాశిక్షణ శిబిరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి అని కోచ్ అనుప్ కుమార్ యామా తెలిపారు

## మహారాష్ట్రలో భారీ అగ్నిప్రమాదం



మహారాష్ట్రలోని థానే జిల్లా, భీవండీ ప్రాంతంలోని వాడ్పేలో ఉన్న రిచ్‌లాండ్ కాంప్లెక్స్‌లో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. దట్టమైన పొగతో భారీగా మంటలు ఎగిసిపడుతున్నాయి. ప్రమాద సమాచారం అందిన వెంటనే ఫైర్ బ్రిగేడ్, భివండీ, కల్యాణ్ ప్రాంతాల నుంచి వచ్చిన నాలుగు అగ్నిమాపక యంత్రాలు ఘటన స్థలానికి చేరుకుని మంటల అదుపులోకి తెచ్చేందుకు నిమగ్నమయ్యాయి.స్థానిక పోలీసులు కూడా సహాయ చర్యల్లో పాల్గొన్నారు. కొన్ని కిలోమీటర్ల దూరం నుంచే మంటల పొగ స్పష్టంగా కనిపించడంతో పరిసర ప్రాంతాల్లో ప్రజలలో భయాందోళనలు నెలకొన్నాయి.ప్రారంభంలో ఐదు కంపెనీల గోదాముల్లో మంటలు చెలరేగగా, అనంతరం మండపం డెకరేషన్ స్టోరేజ్ వరకూ విస్తరించి మొత్తం 22 గోదాములను చుట్టుముట్టినట్లు సమాచారం.ఇప్పటివరకు ప్రాణనష్టం గురించి ఎలాంటి అధికారిక సమాచారం వెలువడలేదు. అయితే అగ్నిప్రమాదానికి గల కారణాలు ఇంకా నిర్ధారణ కావాల్సి ఉంది. అధికారులు దర్యాప్తును ప్రారంభించారు.

## ఏపీలో టెక్నాలజీ భవిష్యత్తుపై సీఎం చంద్రబాబు స్పందన



రాష్ట్రంలో సమ్మిళిత, సుస్థిర భవిష్యత్తును నిర్మించేందుకు తమ ప్రభుత్వం పూర్తి నిబద్ధతతో ఉందని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. జాతీయ సాంకేతిక దినోత్సవాన్ని పురస్కరించుకుని నేడు ఆయన 'ఎక్స్' వేదికగా తన సందేశాన్ని పంచుకున్నారు."ఆవిష్కరణ ప్రగతికి చోదకశక్తి అయితే, సాంకేతికత దానికి ఇంధనం. జాతీయ సాంకేతిక దినోత్సవం నాడు, సుపరిపాలనలో ఆవిష్కరణల స్ఫూర్తిని, సాంకేతికత పరివర్తన శక్తిని మనం గౌరవించుకుంటున్నాం. వ్యవసాయ రంగం నుంచి కృత్రిమ మేధస్సు వరకు, సాంకేతికత ప్రజల జీవితాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకువస్తోందని, ఉత్పాదకతను గణనీయంగా పెంచుతోందని, మానవాళి ఎదుర్కొంటున్న క్లిష్టమైన సవాళ్లకు పరిష్కారాలను చూపుతోంది" అని చంద్రబాబు పేర్కొన్నారు.ఆంధ్రప్రదేశ్‌లో సాంకేతిక పరివర్తనకు 'క్వాంటం వ్యాలీ'ని గుండెకాయగా అభివర్ణించిన చంద్రబాబు, "అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలను సద్వినియోగం చేసుకుంటూ సమ్మిళిత, సుస్థిర భవిష్యత్తును నిర్మించడానికి మేము కట్టుబడి ఉన్నాం. ప్రపంచం భారతదేశం ఎదుగుదలను ఆసక్తిగా గమనిస్తోంది. ఇప్పుడు తదుపరి ఆవిష్కరణలకు నాయకత్వం వహించాల్సిన సమయం వచ్చింది" అని చంద్రబాబు తన సందేశంలో ఆశాభావం వ్యక్తం చేశారు.

## వైవీఎస్ చౌదరి- ఎన్టీఆర్ సినిమా ప్రారంభం



వైవీఎస్ చౌదరి.. ఈ పేరు ఇప్పటి తరం వారికి అంతగా పరిచయం లేకపోవచ్చు. కానీ సీతారామరాజు, లాహిరి లాహిరి లాహిరిలో, సీతయ్య, దేవదాస్ లాంటి సూపర్ హిట్ మాస్ చిత్రాలను తెరకెక్కించింది ఈయనే అని గుర్తు చేస్తే తెలుస్తుంది. ఎంతోమంది హీరోలను టాలీవుడ్‌కు పరిచయం చేసిన ఈ క్రేజీ డైరెక్టర్ ఇప్పుడు నందమూరి తారక రామారావు కుటుంబం నుండి మరో కొత్త నటుడిని పరిచయం చేయడానికి సిద్ధమయ్యారు. ఎన్టీఆర్ నట వారసుల్లో నాలుగో తరం, నందమూరి హరికృష్ణ మనవడు (జానకిరామ్ కుమారుడు) అయిన నందమూరి తారక రామారావు (జూనియర్ ఎన్టీఆర్ కాదు) హీరోగా వైవీఎస్ చౌదరి దర్శకత్వంలో టాలీవుడ్‌లోకి అడుగుపెట్టనున్నారు. న్యూ టాలెంట్ రోర్స్ బ్యానర్‌పై యలమంచిలి గీత ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో తెలుగమ్మాయి వీణ రావు హీరోయిన్‌గా నటించనుంది. ప్రముఖ సంగీత దర్శకుడు కీరవాణి సంగీతం అందించనుండగా, చంద్రబోస్ సాహిత్యం సమకూరుస్తున్నారు. సాయిమాధవ్ బుర్రా ఈ సినిమాకు సంభాషణలు రాస్తున్నారు. తాజాగా ఈ చిత్రం నేడు తెలంగాణ సెక్రటేరియట్ వద్ద ఉన్న ఎన్టీఆర్ గార్డెన్స్‌లో పూజ కార్యక్రమాలు పూర్తి చేసుకుంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా లోకేశ్వరి, పురందేశ్వరి, భువనేశ్వరిలతో పాటు ఎన్టీఆర్ కుటుంబసభ్యులు హాజరయ్యారు. భువనేశ్వరి క్లాప్‌కొట్టి సినిమాను ప్రారంభించింది. కాగా.. నందమూరి కుటుంబం నుండి వస్తున్న మరో వారసుడు కావడంతో ఈ చిత్రంపై ప్రేక్షకుల్లో ఆసక్తి నెలకొంది. వైవీఎస్ చౌదరి ఈ యంగ్ టాలెంట్‌ను ఎలా పరిచయం చేస్తారో చూడాలి. త్వరలోనే ఈ సినిమాకు సంబంధించిన మరిన్ని వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉంది.

# రైస్ కార్డ్ సులభతర సేవలు ప్రారంభం



రాష్ట్రంలో పౌర సరఫరాల సేవలను ప్రజలకు మరింత చేరువ చేసే దిశగా ప్రభుత్వం కీలక చర్యలు చేపట్టింది. నూతన రైస్ కార్డుల జారీతో పాటు ఇతర ఆరు రకాల అనుబంధ సేవలను అందుబాటులోకి తెచ్చినట్లు రాష్ట్ర ఆహార, పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ వెల్లడించారు. ఈ సేవలను ఇప్పటికే 72,519 మంది వినియోగించుకున్నారని, మే 15వ తేదీ నుంచి వాట్సాప్ గవర్నెన్స్ విధానం ద్వారా కూడా ఇంటి వద్ద నుంచే దరఖాస్తు చేసుకునే వెసులుబాటు కల్పిస్తున్నట్లు ఆయన తెలిపారు.గుంటూరు జిల్లా తెనాలిలోని తన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంత్రి నాదెండ్ల మనోహర్ ఈ వివరాలను వెల్లడించారు. ఈ నెల 8వ తేదీ నుంచి నూతన రైస్ కార్డుల జారీ, కార్డుల విభజన, చిరునామా మార్పు, కుటుంబ సభ్యుల చేర్పులు, తొలగింపులు, కార్డుల సరెండర్ వంటి ఆరు రకాల సేవలు గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా అందుబాటులోకి వచ్చాయని ఆయన వివరించారు. త్వరలో, అంటే మే 15 నుంచి, 95523 00009 నంబర్‌కు వాట్సాప్ లో "Hello" అని సందేశం పంపడం ద్వారా కూడా ఈ సేవలను పొందవచ్చని మంత్రి తెలిపారు. అంతేకాకుండా, జూన్ మాసంలో అర్హులైన వారందరికీ ఉచితంగా స్మార్ట్ కార్డుల రూపంలో నూతన రైస్ కార్డులను అందజేయనున్నట్లు ప్రకటించారు.నూతన రైస్ కార్డుల జారీ ప్రక్రియలో జాప్యం గురించి వివరిస్తూ, "2024 ఎన్నికల నేపథ్యంలో గత ఏడాది మార్చిలో భారత ఎన్నికల సంఘం నూతన కార్డుల జారీని నిలిపివేయాలని ఆదేశించింది. ఆ తర్వాత, సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు Ekyc నమోదు తప్పనిసరి చేయడంతో నూతన కార్డుల జారీకి కొంత ఆటంకం ఏర్పడింది. అయితే, ఇప్పటివరకు 95 శాతం Ekyc ప్రక్రియ పూర్తయినందున, ఇప్పుడు నూతన రైస్ కార్డుల జారీకి మార్గం సుగమమైంది" అని మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు.ప్రస్తుతం రాష్ట్రంలో 1,46,21,223 రైస్ కార్డులు ఉన్నాయని, వీటి ద్వారా సుమారు 4,24,59,028 మంది లబ్ధి పొందుతున్నారని మంత్రి తెలిపారు. ఐదేళ్ల లోపు పిల్లలు, 80 ఏళ్లు పైబడిన వృద్ధులకు Ekyc నుంచి మినహాయింపు ఇవ్వడంతో దాదాపు 6,45,765 మందికి ఈ ప్రక్రియ అవసరం లేకపోయిందని అన్నారు.సంస్కరణల్లో భాగంగా, Ekyc పూర్తి చేసుకున్న ప్రతి ఒక్కరికీ ఉచితంగా స్మార్ట్ రేషన్ కార్డును అందజేస్తామని, ఈ కార్డులో కుటుంబ సభ్యులందరి వివరాలు పొందుపరచబడతాయని మంత్రి వివరించారు. ఒంటరిగా నివసిస్తున్న వారు, 50 ఏళ్లు పైబడి వివాహం కానివారు, భార్యాభర్తల నుంచి విడిపోయినవారు, అనాథాశ్రమాల్లో నివసించే వృద్ధులు కూడా నూతన రైస్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవచ్చని ఆయన స్పష్టం చేశారు.

మొట్టమొదటిసారిగా లింగమార్పిడి చేసుకున్న వారికి కూడా ఈ రైస్ కార్డు సేవలను అందుబాటులోకి తెస్తున్నట్లు మంత్రి ప్రకటించారు. దీంతో పాటు, రాష్ట్రవ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో పింఛను పొందుతున్న కళాకారులకు, కొండ ప్రాంతాల్లో నివసించే చెంచులు, యానాదులు వంటి 12 ఆదిమ గిరిజన తెగలకు చెందిన వారికి ప్రత్యేకంగా ఏఏవై అంత్యోదయ అన్న యోజన కార్డులను మంజూరు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్డుల ద్వారా వారికి నెలకు 35 కిలోల బియ్యం అందజేయడం జరుగుతుందని మంత్రి నాదెండ్ల మనోహర్ వివరించారు.



## విద్యా బాలన్ కోసం ఆ పాత్ర రాసిన పూరి!

డాషింగ్ డైరెక్టర్ పూరి జగన్నాథ్ దర్శకత్వంలో విజయ్ సేతుపతి హీరోగా ఓ సినిమా రాబోతుంది. నేటి రాజకీయాల పై ఈ చిత్రం ఉండబోతుందని.. పైగా సినిమాలో పొలిటికల్ సెటైర్లు చాలా ఉంటాయని.. నేటి సమాజానికి తగ్గట్టు పూరి స్క్రిప్ట్ రెడీ చేశాడని ఇప్పటికే వార్తలు వచ్చాయి. ఈ చిత్రంలో బాలీవుడ్ హీరోయిన్ విద్యా బాలన్ ఓ కీలక పాత్రలో నటిస్తోందని, పైగా రాజకీయ నాయకురాలి పాత్రలో ఆమె కనిపిస్తారని తెలుస్తోంది. సహజంగా పూరి క్యారెక్టర్స్ లో డెప్త్ ఉంటుంది. మరి రాజకీయాల పై ఎలాంటి పాత్రలు రాశాడో చూడాలి. ఐతే, పూరి జగన్నాథ్ దర్శకత్వంలో ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని హీరోగా వచ్చిన "డబుల్ ఇస్మార్ట్" ఆశించిన స్థాయిలో పాజిటివ్ టాక్ ను తెచ్చుకోలేక పోయింది. ముఖ్యంగా పూరి గత సినిమాలతో పోల్చుకుంటే.. ఈ సినిమాలో బలమైన కంటెంట్ మిస్ అయ్యింది అంటూ కామెంట్స్ వినిపించాయి. ఈ నేపథ్యంలో పూరి, విజయ్ సేతుపతి కోసం బలమైన కథను రాశాడట. మరి ఈ సినిమాతో పూరి ఏ రేంజ్ హిట్ ను అందుకుంటాడో చూడాలి.